


మానేరు డ్యాంలో తగ్గిన నీరు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

డెడ్ స్టోరేజీకి చేరువలో దిగువ మానేరు రిజర్వాయర్

- మూడునెలలుగా బూస్టర్లతో పంపింగ్
- నాలుగు రిజర్వాయర్ల పరిధిలో తాగునీటికి కటకట
- 10 టీఎంసీల నీరు ఉండేలా చూడాలని కౌన్సిల్ తీర్మానం

కరీంనగర్ టౌన్, మార్చి 9: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండి పోతున్నాయి. మార్చి మొదటి వారం నుంచే 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే మార్చి, ఏప్రిల్, మే వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు గతంలో మాదిరిగా కాళేశ్వరం నుంచి రిజర్వాయర్లకు నీరు వచ్చే అవకాశం లేకపోవడంతో భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి.

హైలెవల్ జోన్‌లో ఇబ్బందులు

మూడు నెలలుగా ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడంతో ఆన్‌లైన్ బూస్టర్ పంపుసెట్ల ద్వారా రా వాటర్‌ను తీసుకొని శుద్ధిచేసి సరఫరా చేస్తోంది. కొన్ని రోజులుగా 55 మిలియన్ లీటర్లను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. దీంతో హైలెవల్ జోన్ పరిధిలోని మల్కాపూర్, ఎస్సారార్ కళాశాల, అంబేద్కర్ రిజర్వాయర్ల పరిధిలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మిగిలిన రిజర్వాయర్ల పరిధిలో ఎప్పటిలాగే ప్రతిరోజూ నల్లానీటిని షెడ్యూల్ ప్రకారంగా విడుదల చేస్తుండగా, ఈ మూడు రిజర్వాయర్ల పరిధిలో నళ్ళా నీరు ఒక్కోసారి రోజు విడిచి రోజు, కొన్ని సార్లు అర్ధరాత్రి ఎప్పుడో నళ్ళా నీరు ఇవ్వడంతో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఆందోళన చెందుతున్నారు. గ్రావిటీ ద్వారా ఈ మూడు రిజర్వాయర్లకు నీటిని పంపించి సరఫరా చేస్తున్నామని, డ్యామ్‌లో నీరు లేక పోవడంతో ఎప్పటిలాగే ప్రతిరోజు సమయపాలనతో నీటిని అందించలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఏప్రిల్ 10వ తేదీకి ఎల్‌ఎండీలో 5.3 టీఎంసీలకు నీటి నిలువలు తగ్గితే ఈ రిజర్వాయర్లతో పాటు నగరమంతటా ప్రతిరోజూ మంచినీటిని ఇవ్వడం సాధ్యం కాదని, గతంలో మాదిరిగా రోజు విడిచి రోజు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. దీంతో ఓవైపు అడుగంటిన భూగర్భజలాలతో బోరుబావుల్లో నీరు లేక, వేసవిలో నీటి అవసరాలు పెరుగుతున్న సమయంలో నల్లా నీరు కూడా ఇవ్వకుంటే తాగునీటితోపాటు ఇతర అవసరాలు కూడా తీర్చుకోవడమెలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో కార్పొరేటర్లు రెండునెలలుగా తమ డివిజన్లలో మంచినీటి ఇబ్బందులు ఏర్పడ్డయని, కోర్టు రిజర్వాయర్ నుంచి తమకు నీటిని మళ్ళించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో నగరంలో ప్రతిరోజు మంచినీటిని అందించేందుకు ఎల్‌ఎండీలో 10 టీఎంసీల నీటి నిలువలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

7.496 టీఎంసీలకు పడిపోయిన ఎల్‌ఎండీ నీరు

కరీంనగర్‌కు తాగునీటిని అందిస్తున్న దిగువ మానేరు రిజర్వాయర్ (ఎల్‌ఎండీ)లో నీటినిలువలు రోజురోజుకు గణనీయంగా తగ్గుతూ డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. 24.034 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్‌ఎండీలో ప్రస్తుతం 7.496 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ రిజర్వాయర్‌కు మిడ్ మానేరు ద్వారా రోజు 2,500 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి కాకతీయ కెనాల్ ద్వారా 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో 276 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోందని అధికారులు అంచనా వేశారు. ఇదే పరిస్థితి ఉంటే ఏప్రిల్ 10వ తేదీ వరకు 5.3 టీఎంసీలకు నీటి నిలువలు పడిపోతాయని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలంటూ ఇరిగేషన్‌శాఖ అధికారులు నగరపాలక సంస్థకు లేఖ రాశారు. నగరపాలక సంస్థ ప్రతిరోజు 61 మిలియన్ లీటర్ల నీటిని ఎల్‌ఎండీ నుంచి తీసుకొని ఫిల్టర్‌బెడ్‌లో శుద్ధిచేసి హైలెవల్, లోలెవల్ జోన్ పరిధిలోని 17 రిజర్వాయర్ల ద్వారా ప్రతి ఇంటికి నళ్లాల ద్వారా అందిస్తోంది.


నీరు లేక ఎండిపోయిన ఎల్‌ఎండీ

ఎస్సారెస్పీ నుంచి ఐదు టీఎంసీల నీటిని ఇవ్వాలి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో నీటిని నిలువలు 7.5 టీఎంసీలకు చేరుకోవడంతో మూడు, నాలుగు రిజర్వాయర్ల పరిధిలో ఇప్పటికే మంచినీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 10 వరకు 5.3 టీఎంసీలకు నీటి నిలువలు పడిపోతాయని అధికారులు చెబుతున్నారు. అప్పుడు నగర ప్రజలకు రోజు మంచినీటిని ఇవ్వడం సాధ్యపడదు. ఎస్సారెస్పీ నుంచి ఐదు టీఎంసీల నీటిని ఎల్‌ఎండీకి వదిలి 10 టీఎంసీలు నీరు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే నగర ప్రజలకు వేసవిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతిరోజు మంచినీటిని అందించే వీలవుతుంది.

తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు

- శ్రీరాంసాగర్ నుంచి 3 టీఎంసీల నీరు మిడ్ మానేరుకు వచ్చింది
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మార్చి 9: కరీంనగర్‌లో నీటి ఎద్దడి ఉందని ఒక అపోహ సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాభావం పరిస్థితులు ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని చెబితే దానిని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వేసవి కాలం దృష్ట్యా తాగు, సాగు నీటికి నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు, రైతుల పంటలకు కూడా ఇబ్బందులు లేకుండా నీరు అదించాలని ఇప్పటికే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాగు నీటికి ఎక్కడ కూడా ఇబ్బందులు లేవని, ఇప్పటికే శ్రీరాం సాగర్ నుంచి మూడు టీఎంసీల నీరు మిడ్ మానేరుకు చేరుకుందని, ప్రస్తుతం మిడ్ మానేరులో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 7.5 టీఎంసీల నీరు ఉందని, మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం సాగు నీరు కోసం నీటిని విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏప్రిల్ 11 నుంచి మిడ్ మానేరు నుంచి ఎల్‌ఎండీకి తాగు నీటి కోసం రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పారన్నారు. ఇప్పటికీ కరీంనగర్ ఎల్‌ఎండీ, మిడ్ మానేరు నుంచి గ్రామాలకు అందే తాగు నీటికి ఎక్కడ కూడా ఇబ్బందులు లేవన్నారు. ప్రస్తుతం మిడ్ మానేరు, ఎల్‌ఎండీలలో ఉన్న నీటితో భవిష్యత్‌లో తాగు నీటికి ఎక్కడ కూడా ఇబ్బందులు ఉండవన్నారు. ఇప్పుడున్న నిల్వలతో జూలై 30 వరకు తాగు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే ప్రాజెక్టులకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మూడు నెలల్లోనే మేమేదో నీటిని మొత్తం తోడేసినట్టు చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, నీటి ఎద్దడి అపోహ సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తెలిపారు. కరీంనగర్ ప్రజలకు నీటి కొరత రాకుండా చూసే బాధ్యత తమదని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మాత్రమే కేవలం నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నామన్నారు. ఇప్పుడు నీటిని పొదుపుగా వాడుకుంటే వర్షాలు కురిసే వరకు కూడా తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కరీంనగర్‌లో తాగునీటికి ఇబ్బందులు ఉండకుండా చూడాలని పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్‌సుల్తానియతో పాటు ఇరిగేషన్ అధికారులకు, మున్సిపాలిటీ అధికారులకు, కలెక్టర్ పమేలా సత్పతికి ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



కదనభేరి సభకు లక్ష మంది జనసమీకరణ

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, మార్చి 9: ఎస్సారార్ కళాశాల మైదానంలో ఈనెల 12న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహిస్తున్న కరీంనగర్ కదనభేరి సభకు లక్షమందికిపైగా జన సమీకరణ చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆ తర్వాత కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్‌కు కరీంనగర్ అంటే సెంటిమెంట్ జిల్లా అని, లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడే ప్రారంభిస్తారని చెప్పారు. కరీంనగర్ నియోజకవర్గం నుంచి 20వేలు, మానకొండూర్, హుజురాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల నుంచి 15వేల మంది హాజరవుతారని చెప్పారు. సిరిసిల్ల వేములవాడ, హుజురాబాద్, హుస్నాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలను సెయింట్ జాన్స్, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి వాహనాలను రేకుర్తి ఈద్గా, శుభంగార్డెన్స్‌లో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆయన నగరంలో, బహిరంగ సభ జరిగే కళాశాల మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లు, జన సమీకరణ తదితర అంశాలపై చర్చిం చారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, గందె మాధవి మహేశ్, ఏసీపీ విజయ్‌కుమార్, సీఐలు సృజన్‌కుమార్, రమేశ్, ట్రాఫిక్ సీఐ పర్శ రమేశ్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల నియామకం

కరీంనగర్ కదనభేరి బహిరంగ సభకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఇన్‌చార్జిలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఓ ప్రకటలో తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, వేములవాడకు మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, హుస్నాబాద్‌కు మాజీ ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, సిరిసిల్లకు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మానకొండూర్‌కు కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కరీంనగర్ నియోజ కవర్గానికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, చొప్పదండికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల భూపతిరెడ్డిలను నియమించారన్నారు.

తవ్వేకొద్దీ.. బయటపడుతున్న అక్రమాలు

- భూకబ్జాలపై సీపీకి 1,700కు పైగా ఫిర్యాదులు
- 32 సంఘటనల్లో 62 మందిపై కేసులు, 30 మంది అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 9: తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. భూములకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టి, దౌర్జన్యాలు, కూల్చివేతలు, బెదిరింపులు, డబ్బుల డిమాండ్, భూకబ్జాలు తదితర ఆర్థిక నేరాలకు సంబంధించిన అక్రమార్కుల అరెస్టుల పర్వం కొనసాగుతున్నది. గురువారం ప్రస్తుతం గజ్వేల్‌లో పనిచేస్తున్న తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్, వీఆర్‌ఏ(గతంలో కొత్తపల్లిలో) జీవన్‌ను పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌తో జైలుకు పంపిన ఘటన కలకలం సృష్టించింది. తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఇంతకు ముందు భూకాబ్జాకు సంబంధించిన కేసులో నోటీసులు జారీ చేసి అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేయగా పసిగట్టిన శ్రీనివాస్ హైకోర్టుకు వెళ్లి అరెస్టు చేయకుండా రక్షణ పొందారు. ఆ కేసును అలాగే వదిలేసిన పోలీసులు వ్యూహాత్మకంగా మరో కేసులో అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. తహసీల్దార్ అరెస్టుకు రెండు రోజుల ముందే ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన పెద్ద మనిషి నుంచి సీపీకి ఫోన్ వెళ్లిందని, కాని ఆయన నిందితులతో వ్యవహరించే తన కఠిన వైఖరిని కొనసాగించారని సమాచారం.

కొనసాగుతున్న ఫిర్యాదులు

భూకబ్జాలు, దౌర్జన్యాలు, నకిలీడాక్యుమెంట్లతో మోసాలపై బాధితులు సీపీకి ఫిర్యాదుల వెల్లువ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 1,700కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిలో 70 నుంచి 80 శాతం వరకు భూకబ్జాలు, మోసాలకు సంబంధించినవే ఉన్నాయి. భూ కబ్జాలు, దౌర్జన్యాలు, ఆర్థికనేరాలకు సంబంధించినవి ఇప్పటి వరకు 62 మందిపై కేసులు నమోదుకాగా 30 మంది అరెస్టు అయ్యారు. ఇందులో కార్పొరేటర్లు, కార్పొ రేటర్ల భర్తలు, మాజీ ఎంపీటీసీ, మాజీ ఆర్టీఏ మెంబరు, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, తహసీల్దార్, వీఆర్‌ఏ, రాజకీయ పార్టీల నాయకులు, ఇతరులు ఉన్నారు. ఇంకా కొందరు పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులకు నోటీసులు జారీ చేసేందుకు కసరత్తులు జరుగు తుండగా మరికొందరిని అరెస్టు చేసేందుకు సిద్దమ వుతున్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి 9: నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించడం, లైన్ షిఫ్టింగ్, కొత్త లైన్ వర్క్ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టూ, ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయికృష్ణ థియేటర్, భగత్‌నగర్ ఏరియా, ముకరంపుర ఏరియా, గీతభవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏరియా, కలెక్టరేట్ కాంప్లెక్స్ అపోజిట్ ఏరియా, ఇండస్ట్రియల్/పద్మానగర్ ఫీడర్‌లోలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, బుల్ స్టేషన్, కరీంనగర్ డెయిరీ, శ్రీహరినగర్, సంతోష్‌నగర్, వినాయకనగర్, కుర్మవాడ ఏరియాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్‌కాలనీ సబ్‌స్టేషన్, కోర్టు రోడ్డు, బ్యాంక్ కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మినగర్, జగిత్యాల రోడ్, జ్యోతినగర్ మోర్ సూపర్ మార్కెట్ వెనుక ప్రాంతంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

భూనిర్వాసితులకు అన్యాయం జరుగకుండా చూడండి

- కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ టౌన్, మార్చి 9: జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా భూములు, ఇళ్ళు కోల్పోతున్న నిర్వాసితులకు అన్యాయం జరుగకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి పనులపై ఆశాఖ అధికారులు, ఆర్డీవో కె మహేశ్వర్‌తో సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్-జగిత్యాల నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా 13 గ్రామాల్లో భూమిని సేకరిస్తున్నామని చెప్పారు. అయా గ్రామాల్లో భూసేకరణ దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. నిర్వాసితులకు పరిహారం అందించేందుకు అధి కారులు భూసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని సనూచించారు. పరిహారం త్వరగా అందించేందుకు మే నెలలో ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. సిబ్బంది కొరత ఉంటే వేరే చోటు నుంచి తెప్పించుకొని వేగంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే రోడ్స్ అథార్టీ పీడీ మాధవి, మేనేజర్ నవకాంత్, ఆర్డీవో కె మహేశ్వర్, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ శ్రీవాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఎమ్మెల్యే

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఎల్లంపల్లి ఆఫీస్ గేట్లు బద్దలుకొట్టి నీళ్లు తీసుకువస్తాం
- ప్రజాహిత యాత్రలో ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

గంగాధర, మార్చి 9: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్ర శనివారం గంగాధరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి అభ్యర్థిలేని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయ్యాలని ప్రశ్నించారు. కేంద్రం ఉచితంగా గ్యాస్, బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. మోదీ ఇస్తున్న నిధులు ప్రతి గ్రామానికి రావాలంటే ఇచ్చేటోనికే ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. రైతులకు ఎరువులు సబ్సీడీ అందిస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటెయ్యవద్దని, మోదీకి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి ఉపాధి పని కోసం 167.42 కోట్లు, నూతన రోడ్ల నిర్మాణానికి 72.31 కోట్లు, చెట్ల పెంపకానికి 88.52 కోట్లు మోదీ మంజూరు చేశారన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను నాశనం చేశాడని విమర్శించారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోతే తుపాకీ రాముడిలాగా కేసీఆర్ టోపీ పెట్టుకుని ఇక్కడికి వచ్చి రేపే పరిహారం ఇస్తానని మోసం చేశాడన్నారు. ఏ రైతు ఖాతాల్లోనైనా నష్టపరిహారం పడిందా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కాంగ్రెస్‌కు ఓటేస్తే అధికారంలోకి వచ్చి 80 రోజులైనా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. నారాయణపూ ర్‌కు నీళ్ల విడుదల చేయకుంటే అవసరమైతే గేట్లు బద్దలుకొట్టి నీరు తీసుకువస్తామన్నారు. రైతులకున్యాయం చేయాలని, పంటలు ఎండబెడితే వారి ఉసురు తగులుతుందన్నారు., దర్మం కోసం, దేశం కోసం అందరికిన్యాయం చేసే బీజేపీకి ఓటేయ్యాలని కోరారు. అనం తరం లక్ష్మిదేవిపల్లి, బూరుగుపల్లి, ర్యాలపల్లి వరకు యాత్ర సాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, నాయకుడు వైదరామానుజం, కోల అశోక్, బత్తుల లక్ష్మీనా రాయణ, పవన్‌కుమార్, రేండ్ల శ్రీనివాస్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే కేంద్రంలో సుస్థిర పాలన.

రామడుగు: కేంద్రంలో బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట, రామడుగు, శ్రీరాములపల్లి, తిర్మలాపూర్, షానగర్ గ్రామాల్లో శనివారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి ఎక్కువ ఎంపీలను గెలిపిస్తే అధిక నిధులు తీసుక వచ్చి అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎక్కడి నుంచి నిధులు తీసుకవస్తారో వారికే తెలియదన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆగం అయిందని మరోసారి మోసపోయి కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఓటు వేయవద్దని ప్రజలను కోరారు. మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వంట గ్యాస్ ధర వంద రూపాయలు తగ్గించారన్నారు. అనంతరం అంబేద్కర్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రామడుగులో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీజేపీ కార్యకర్త రాజును పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేబొడిగె శోభక్క, ఎడవెల్లి నరేందర్ రెడ్డి, కరుణశ్రీ, నర్సింహారెడ్డి, నేరెళ్ల అంజయ్య, యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరుశరాములు, సత్తమ్మ పాల్గొన్నారు.


గోపాల్‌రావు పేటలో అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపీ బండి సంజయ్.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 9: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గొడిశాల శేఖరయ్య అనే గీత కార్మికుడు శనివారం తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వృత్తిలో భాగంగా శేఖరయ్య తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో జారి కిందపడి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.10వేల నగదు, బంగారం అపహరణ

కోనరావుపేట, మార్చి 9: కోనరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారం అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సామ నరసింహారెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కూరగాయలను అమ్మడానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి పదివేల రూపాయల నగదు, అర్ధతులం బంగారం అపహరించారు.

నరసింహారెడ్డి కూరగాయలు అమ్మిన అనంతరం రాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి కిటికీ నుంచి గుర్తు తెలియన వ్యక్తి వచ్చి బీరువా పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు గుర్తిం చాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ముదురుతున్న సంక్షోభం

● పార్టీ నుంచి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్

వేములవాడ, మార్చి 9: వేములవాడ పురపాలక సంఘం పరిధిలో బీఆర్ఎస్ పార్టీలో సంక్షోభం ముదురుతోంది. శాసనసభ ఎన్నికలలో ఓటమి తో ఇప్పటికే ఆ పార్టీ కార్యకర్తలలో మనోధైర్యం దెబ్బతినగా, ఎన్నికల అనంతరం ఆ పార్టీ కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఆ పార్టీకి మరింత తలనొప్పిగా మారి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు దారితీసింది. మార్చి 7వ తేదీన జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారం కుమార్ ఓటమిపాలయ్యారు. సొంత పార్టీకే చెందిన కౌన్సిలర్లు పార్టీ విప్‌ను కూడా ధిక్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి మహేష్‌కు ఓటు వేశారు. దీంతో మారం కుమార్‌కు ఓటమి తప్పలేదు. ఈ ఎన్నికపై పోస్టుమార్టం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసి బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించారంటూ రెండు మిద్దెల జయ(2వ వార్డు), యాచమనేని శ్రీనివాసరావు(11వ వార్డు), జడల లక్ష్మి(5వ వార్డు), మధు రాజేందర్ శర్మ(23వ వార్డు), ముప్పిడి సునంద(26వ వార్డు)లను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మిగతా వారిపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అయితే ఈ ఐదుగురు కౌన్సిలర్లు టీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని భావించి వారిని పార్టీ నుంచి ఆగమేఘాలపై సస్పెండ్ చేసినట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా టీఆర్ఎస్ పార్టీకి తామే రాజీనామా చేస్తున్నామని మున్సిపల్ కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, మధు రాజేందర్ శర్మ, జడల లక్ష్మి, ముప్పిడి సునంద ప్రకటించారు. వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో పార్టీ కౌన్సిలర్ల నుండి అభిప్రాయాలు సేకరించలేదని, అభ్యర్థి ఎంపిక విషయంలో కనీస విధివిధానాలు పాటించలేదని వారు ఆరోపించారు. ఏకపక్ష విధానాలతో వ్యవహరిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్న తీరుకు నిరసనగా తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు ప్రకటించారు. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నుంచి ప్రారంభమైన రాజీనామాలు, వలసలు రోజురోజుకు పెరుగుతుండడం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. టీఆర్ఎస్ పార్టీలోని మరికొందరు కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని స్థానిక రాజకీయ వర్గాలలో జోరుగా చర్చ సాగుతోంది.

తాట్లవాయి హత్యపై వీడిన మిస్టరీ?

● పోలీసుల అదుపులో నిందితుడు? ● కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడి హత్య మిస్టరీని పోలీసులు శనివారం చేధించినట్లు తెలిసింది. ఈ హత్యకు పాత కక్షలే కారణమని, హత్యకు పాల్పడిన వ్యక్తి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుని ఆచూకీ తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని హత్య మిస్టరీని చేధించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి, నిందితుడి సెల్‌ఫోన్‌ను హతుడి వ్యవసాయ బావిలో నుంచి పోలీసులు శనివారం బయటకు తీసినట్లు సమాచారం. ఈ హత్యకు పాల్పడిన వ్యవహారంలో ఎందరి పాత్ర ఉందోనని పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.

మహిళ దారుణ హత్య

● నిందితుల కోసం పోలీసుల గాలింపు


మల్లవ్వ (ఫైల్)

వీర్నపల్లి, మార్చి 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి మల్లవ్వ (42)ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చి హతమార్చినట్లు భావిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్‌లు సైతం పసిగట్టని విధంగా మహిళ మృతదేహంతో పాటు ఇంటి పరిసరాల్లో కారంపొడి చల్లి దుండగులు పరారయ్యారు. కిరాతక హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం క్రితం భర్తతో విడాకులు తీసుకుని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇద్దరు కుమారుల్లో ఒకరు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరో కుమారుడు శేఖర్ తంగళ్లపల్లిలో కూలి పని చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. తల్లిగారి ఇంటి వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్న మల్లవ్వను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు ఇద్దరు అర్ధరాత్రి పూట రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని మల్లవ్వ వివరాలు అడిగినట్లు సమాచారం. అర్ధరాత్రి ఒంటరిగా ఇంట్లో నివసిస్తున్న మల్లవ్వను గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లవ్వను హత్య చేసిన దుండగులు శరీరంపై కారం చల్లి ఆనవాళ్లు గుర్తు పట్టరాకుండా చేసి పరారయ్యారు. శనివారం ఉదయం అటుగా వచ్చిన గ్రామస్థులు మల్లవ్వ మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. నిందితుల కోసం ఎల్లారెడ్డిపేట ఎస్‌ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్‌ఐ రమేష్, ఆర్ఎస్ఐలు జునైద్, సాయికిరణ్, పోలీస్ ప్రత్యేక బృందం గాలింపు కొనసాగిస్తోంది. మృతురాలి తమ్ముడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మహాసభలు

సుభాష్‌నగర్, మార్చి9: జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటటివ్స్ చేస్తున్న న్యాయమైన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.మందులపై ధరలను తగ్గించాలని, జీఎస్టీని తొలగించాలని, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న పోరాటాలను ఆయన కొనియాడారు. అనంతరం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కె రమేశ్‌సుందర్ మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ ఆక్ట్-1976ను పరిరక్షించాలన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌లకు చట్టబద్ధమైన పనివిధానాలను కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మా రంగంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమాలను ఉమ్మడి పోరాటాలతో అరికట్టాలన్నారు. అనంతరం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు భట్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపి వేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ కరోనా కాలంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేసిన సేవలను కొనియాడారు. ఈ మహాసభలో ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ నాయకుడు రాంమోహన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు సత్యనారాయణరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకుడు తిరుపతి, ఐద్వా నాయకురాలు నాగమణి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు స్వామి, రాజు, రాజమల్లు, సురేష్, రాజేశం, ఎఫ్ఎంఆర్ఏఐ సహాయ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, టీఎంఎస్ఆర్‌యూ అధ్యక్షుడు భానుకిరణ్, సహాయ కార్యదర్శి నాగేశ్వర్, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు సిహెచ్ శ్రీధర్, సదానందచారి, కె ఐలయ్య, సయ్యద్‌సిద్ధిక్, ఎం అంజయ్య పాల్గొన్నారు.

వెళ్లొస్తాం..రాజన్నా

● వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి జాతర ● తిరుగు ముఖం పట్టిన భక్తులు


వేములవాడ నుంచి తిరిగి వెళ్తున్న భక్తులు

వేములవాడ మార్చి 9: 'ఆపదమొక్కుల రాజన్న దయ ఉంచు.. వచ్చే సంవత్సరం జాతరకు మళ్లీవస్తాం' అంటూ రాజరాజేశ్వర స్వామి భక్తులు వేములవాడ నుంచి తిరుగు ముఖం పట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి జాగరణ పాటించిన భక్తులు తెల్లవారుజామునే ఉపవాసం విడిచారు. పలువురు భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. అనుబంధాలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అభిషేక పూజలో మంత్రి, ప్రముఖులు

మహా శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం రోజున రాజరాజేశ్వర స్వామి వారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో పాల్గొంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, లక్ష్మీ పార్థసారథి, ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు లింగోద్భవ పూజలో పాల్గొన్నారు. అనంతరం శనివారం తెల్లవారుజామున వీరికి అర్చకులు ఆశీర్వచనం గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో డి కృష్ణప్రసాద్, ఏఈఓ హరికిషన్, ఆర్డీఓ రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

జాతర విజయవంతం : విప్ ఆది శ్రీనివాస్

అందరి సహకారం, సమన్వయంతో మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడగలిగామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించిందన్నారు. జాతర విజయవంతంగా జరగడానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంతో సహకరించారని, జాతర ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ పర్యవేక్షణ చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు విప్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్టీసీ సంస్థ దాదాపు 400 బస్సులను కేటాయించి 3వేల ట్రిప్పులు నడిపిందని అన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా మంది భక్తులు తరలి వచ్చి రాజన్నను దర్శించుకున్నారని వివరించారు.

జాతర సందర్భంగా రాజన్న ఆలయ ఆర్జిత సేవల ద్వారా తొలిరోజు ఏడవ తేదీ 24 లక్షల 22 వేల 392 రూపాయలు, రెండవ రోజు ఎనిమిదవ తేదీ 74 లక్షల 6 వేల 600 రూపాయల ఆదాయం సమకూరిందని ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు.


వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



దుబ్బరాజన్న ఆలయంలో అన్నప్రసాద అలంకరణలో స్వామివారు, భక్తులు

భక్త జనంతో కిక్కిరిసిన దుబ్బరాజన్న క్షేత్రం

సారంగాపూర్, మార్చి 9: మండలంలోని శ్రీ దుబ్బ రాజన్న క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మహా శివరాత్రి ఉపవాసాలతో జాగరణ చేసిన భక్తులు ఉదయాన్నే కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్‌లో నిలబడి స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులు గండదీపం, కోడెమొక్కులు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామి వార్లకు అన్న ప్రసాదం, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ధర్మపురిలో రాజేశ్వరుడి రథోత్సవం

ధర్మపురి, మార్చి 9: ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబ శివుని రథోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శివ పార్వతుల ఉత్సవ మూర్తులను రథాలపై ఆశీనులు చేశారు. అనంతరం శ్రీ అక్కపెల్లి ఆలయం నుంచి నంది విగ్రహ చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం జరిపారు. జైనాలో స్వామివారల సేవను ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

● నలుగురు నిందితుల అరెస్టు ● పరారీలో మరో ఇద్దరు

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్న ఓ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును జగిత్యాల పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి వద్ద వివిధ విశ్వ విద్యాలయాలు, బోర్డుల పేరిట సృష్టించిన 395 నకిలీ సర్టిఫికెట్లు, ఒక కంప్యూటర్, ఒక ల్యాప్ టాప్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన కొడితెల మహేశ్ అనే యువకుడు ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లడానికి పాస్ పోర్టు కోసం ప్రయత్నం చేశాడు. పాస్‌పోర్టు దరఖాస్తుతో జతపరచడానికి పదో తరగతి సర్టిఫికెట్ అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందును సంప్రదించాడు. తన సమీప బంధువు అయిన కరీంనగర్‌కు చెందిన బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లు ఎవరికి అనుమానం రాకుండా నకిలీ సర్టిఫికెట్లు ఇస్తారని మహేశ్‌కు చంద్రయ్య సమాచారం అందించాడు. దీంతో చంద్రయ్య సహాయంతో మహేశ్ కరీంనగర్‌లోని రజిత, శ్రావణ్ కుమార్‌లను సంప్రదించగా రూ. 28 వేలకు ఒప్పందం కుదుర్చుకొని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, రూల్ నంబరు (16007125873) గల ఓపెన్ ఎస్ఎస్‌సీ నకిలీ సర్టిఫికెట్‌ను అందించారు. సదరు సర్టిఫికెట్‌తో పాస్‌పోర్టు కోసం మహేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. ధర్మపురి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రావు జరిపిన విచారణలో అది నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించారు. ఈ వ్యవహారాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు జగిత్యాల పోలీసు ఉన్నతాధికారులకు వివరించడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం మరింత లోతుగా విచారణ జరపడంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన రజిత, శ్రావణ్ దంపతులు సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో తమకు జస్ట్ డయల్ ద్వారా పరిచయమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌ల సహాయంతో సుమారు ఐదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ. 30 వేలు, డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ. 40 వేలు, ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌కు రూ.50 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తూ కోరుకున్న సంవత్సరంలో కోరుకున్న పేరు మీద సూచించిన యూనివర్సిటీ, బోర్డుల పేరిట సృష్టించి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు ఐదేళ్ల కాలంలో సుమారు 395 నకిలీ సర్టిఫికెట్లు విక్రయించి సుమారు రూ. 15.41 లక్షలు వసూలు చేసినట్లుగా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ కాలనీలో సొంతిట్లో నివాసమున్న బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లను, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలోని నివాసంలో కొడిచాల మహేశ్, కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 395 నకిలీ సర్టిఫికెట్లు, 5 మొబైల్ ఫోన్లు, రూ. 25 వేల నగదు, ఒక ల్యాప్ టాప్, ఒక కంప్యూటర్ సీపీయూ, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బరహంపూర్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు.



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయం

కరీంనగర్ టౌన్, మార్చి 9: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 21శాతం పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయమని ఐఎన్‌టీయుసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మహమూద్, రాజిరెడ్డి కృషి ఫలితమేనని ఐఎన్‌టియుసీ రాష్ట్ర వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ జక్కుల మల్లేశం గౌడ్, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు టిఆర్‌రెడ్డి, ఎన్‌కె రాజు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు , ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముస్తాబాద్, మార్చి 9: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు యాదయ్య (54) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదయ్య అనే రైతు తన పొలానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలలుగా ఫ్యూజ్ వైరు పడిపోతుంది. దీంతో పొలానికి నీరు సరిగా అందకపోవడంతో శుక్రవారం రాత్రి ఫ్యూజ్ వైరు సరిచేయాలని యాదగిరి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి ఫ్యూజ్ వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యాదగిరి మృతిచెందాడు. సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. యాదగిరికి భార్య లక్ష్మీ, కూతుళ్లు దేవలక్ష్మీ, రమణ, కొడుకులు శేఖర్, రమేశ్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయం

రామడుగు, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయమని, భారతదేశ ఔన్నత్యం, ఆశయాలకు జాతీయజెండా ప్రతిరూపమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో జాతీయజెండాను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 56ఫీట్ల అతిపెద్ద జాతీయ జెండాను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. 77ఏళ్లుగా జాతీయజెండా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. జాతీయ జెండాలో మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోష్, భగత్‌సింగ్, సావర్కర్ వంటి వారు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నేతల త్యాగాలు గుర్తుకు వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మండలంలోని గోపాల్‌రావుపేటలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో అతిపెద్ద జాతీయ జెండా దేశం గర్వించేలా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, సంఘం అధ్యక్షులు కాసారపు పరుశరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.


జాతీయజెండాకు వందనం చేస్తున్న ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై పర్యవేక్షణ ఏదీ?

● ఓవర్‌లోడ్‌తో ప్రయాణాలు.. పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై రవాణా, పోలీసు ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో వాహనాల ఓవర్‌లోడ్, అతి వేగం తదితర నిబంధనలు విస్మరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయిదేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలతో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు. ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా, గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా, నిబంధనల మేరకు మలుపులతో కూడుకొని ఘాట్‌రోడ్డు 2.5 కిమీ.ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు మరో ఘాట్‌రోడ్ కోసం సర్వే చేసి కొత్త రోడ్డుకు 3.6 కి.మీ మేర ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇంత వరకు ఆ ప్రతిపాదనలపై చర్యలు కనిపించడం లేదు. 2018 సెప్టెంబర్ 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాద అనంతరం రాకపోకలను నిషేధించిన అధికారులు 2022 జూన్27న నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చారు. 20స్పీడ్ లోపే వాహనాలను నడుపాల్సి ఉంటుంది. కండీషన్ గల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. భారీ వాహనాలైన బస్సులు, లారీలు, మినీబస్సులు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలకు అనుమతి లేదు. ఓవర్‌లోడ్(ప్రయాణికులు, ఇతరాత్ర)తో వచ్చే ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదు. కిందకు వచ్చే వాహనాలు గేరులోనే రావాలి. న్యూట్రల్‌లో రాకూడదనే నిబంధనలున్నాయి.


ప్రమాదకరంగా ఉన్న కొండగట్టు ఘాట్‌రోడ్డు

ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా - 11మందికి గాయాలు

కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మ్యాదరిపేటకు చెందిన గందం జగన్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో శనివారం ఘాట్‌రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న 12 మందిలో 11మందికి గాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అంజన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు మీదుగా కొండ దిగుతుండగా అదుపు తప్పిన ఆటో బోల్తాపడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో గల అర్విండ్, చంద్రయ్య, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో పరిమితికి మించి ఉండడం, న్యూట్రల్‌లో రావడంతోనే ఆటో అదుపు తప్పినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. గాయపడిన వారంద రినీ చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కరీంనగర్ అర్బన్, మార్చి9: నగర ప్రజల దాహార్తిని తీర్చాలని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థ పరిధిలో నీటి వినియోగం పెరగడం, ఈసారి మానేరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుండడంతో దీని ప్రభావం నీటి పంపిణీ పై పడిందని పేర్కొన్నారు. సమయ పాలన లేకుండా తాగునీటి సరఫరా చేస్తుండడం, తక్కువ ప్రెషర్‌తో రావడంతో కొన్ని ప్రాంతాలలో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రానున్న వేసవికాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నగర ప్రజల దాహార్తి తీర్చడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో నాయకులు మునిగంటి అనిల్, రేశ్న సతీష్, దిలీప్ కుమార్, వంగల విద్యాసాగర్, ఇమ్రాన్, వసీం, మహమ్మద్ ఆమేర్, వీర దేవేందర్ పటేల్, హరీష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అచీవర్స్'లో గ్రాడ్యుయేషన్ డే



పట్టాలతో అచీవర్స్ విద్యార్థులు

గణేశ్‌నగర్, మార్చి 9: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శనివారం కిండర్ గార్టెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త ఎం.డి రియాజ్, కే.వేణుగోపాల్ రెడ్డి, కే.ప్రసన్న, శైలజ ధర్మపురి, పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవిలు జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఖాజీపూర్ వక్ఫ్‌బోర్డు భూములపై సీఎంకు ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మార్చి 9: కొత్తపల్లి మండలం ఖాజీపూర్‌లోని వక్ఫ్‌బోర్డుకు చెందిన సర్వేనెంబరు 122, 126, 129, 171, 154లలోని 34 ఎకరాల అద్గీఖతీఫ్ భూమిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి వక్ఫ్‌బోర్డుకు ఆ భూమిని అప్పగించాలని కోరుతూ సీఎంకు ఫిర్యాదు చేసినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మోసిన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎమ్మెల్యే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వక్ఫ్‌బోర్డు పేరిట ఉన్న ఈ భూమిలో గ్రానైట్ ద్వారా సంపాదించిన దాదాపు 500 కోట్లు రికవరీ చేసి వక్ఫ్‌బోర్డు లేదా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని కోరారు.

వేసవిలోగా అభివృద్ధి పనులన్నింటిని పూర్తి చేస్తాం

-మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 9: నగరంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, వచ్చే వేసవిలోగా అసంపూర్తిగా మిగిలిన పనులన్నిటిని పూర్తిచేస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం 36వ డివిజన్ మంకమ్మతోటలో కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్‌తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు 23 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంకమ్మతోటలో చాలా ఏళ్ళ క్రితం వేసిన రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడంతో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నామని చెప్పారు.

ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్-2024కు అన్నవరం దేవేందర్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 9: కేంద్ర సాహిత్య అకాడమీ న్యూ ఢిల్లీలో ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహించే 'ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్-2024'లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు చెందిన రచయిత అన్నవరం దేవేందర్‌కు శనివారం ఆహ్వానం అందింది. సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె శ్రీనివాసరావు లేఖ రాస్తూ ఈ ఉత్సవంలో పాల్గొని 21వ శతాబ్దపు భారతీయ కవిత్వంపై కవిత చదవాల్సిందిగా కోరారు.

పద్మశ్రీ విజయసారథి జయంత్యుత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి9: పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి జయంత్యుత్సవాలు క్షేత్రం ఆవరణలో శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీభాష్యం విగ్రహానికి అభిషేక, అలంకార, అర్చనలు జరిపారు. సాయంత్రం టీటీడీ కళాకారిణి జయంతి సావిత్రి భాగవతారిణి హరికథా కాలక్షేపం అలరించింది. కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు 7వ రాష్ట్రీయ సంస్కృత పురస్కారాన్ని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతిగుల్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తికి ప్రదానం చేయనున్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, మార్చి 9: జిల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో పోలీస్ యంత్రాంగం, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని అనేక మందిపై కేసులు పెట్టించాడని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కౌశిక్‌రెడ్డి పోలీస్ ఎస్కార్ట్ పెట్టుకొని నియోజకవర్గంలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై అవాకులు, చెవాకులు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదని పేర్కొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

హుజూరాబాద్, మార్చి 9: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఈ నెల 12న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు జరిగే నేపథ్యంలో కరీంనగర్ సెంటిమెంట్‌గా భావించి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్ఆర్ఎస్ కళాశాల మైదానంలో నిర్వహించే కథనభేరి సభకు హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, మార్చి9: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అబద్దాల హామీలను, ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల రమేష్ నివాసంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హజరైన రసమయి బాలకిషన్ మాట్లాడుతూ పచ్చని పొలాలతో కలకలలాడే ప్రాంతాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోని వచ్చిన వంద రోజుల్లోనే ఎండిపోయాయని అన్నారు. ప్రజలు మార్పును కోరుకున్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ ఊహించని మార్పును ప్రజలకు గిఫ్టుగా ఇస్తుందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఈ నెల 12న కరీంనగర్‌లో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరుగనున్న బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 25వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ల్యాగల వీరారెడ్డి, నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, దుండ్ర రాజయ్య యాదవ్, పొన్నం అనిల్ గౌడ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



షెటర్ల నిర్మాణం పరిశీలిస్తున్న రవీందర్

హుజూరాబాద్, మార్చి9: హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగానే ప్రభుత్వ స్థలంలో అక్రమ షెటర్ల నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రోడ్డుపై చిన్న టేలాలు పెట్టుకుంటే తక్షణమే తొలగిస్తున్న హుజూరాబాద్ మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా కార్యాలయం ఎదుటనే నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సైదాపూర్‌లో రోడ్‌లో షెటర్ నిర్మాణాలు చేసుకున్న వారి వద్ద నుంచి లక్షల రూపాయలు మున్సిపల్‌లోని ఓ ప్రజాప్రతినిధి వసూలు చేశారని, దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని, లేకుంటే ప్రగతిభవన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

'రాష్ట్రపతిగా మహిళను నిలిపిన ఘనత బీజేపీది'



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 9: రాష్ట్రపతిగా మహిళను నిలిపిన ఘనత భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహించిన నారీవిజయభేరి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మొట్టమొదటి విదేశాంగ మంత్రిగా సుష్మా స్వరాజ్, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్‌లను నియమించడంతో మోదీ మహిళలకు ఇస్తున్న గౌరవం అర్థమవుతోందన్నారు. మోదీ ప్రధానమంత్రిగా అనేక సంక్షేమ పథకాలు మహిళల కోసం ప్రవేశ పెట్టారన్నారు. మోదీ మహిళల అభ్యున్నతి కోసం 33శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయాల్లో వారికి వివిధ హోదాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. భారత దేశంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందని, మహిళలను పూజిస్తుంటామన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో మహిళలకు సముచితస్థానం కల్పించారన్నారు. ప్రతి గ్రామంలో మహిళల కోసం టాయిలెట్స్, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముస్లిం మహిళల కోసం మోదీ ట్రిపుల్ తలాక్ ప్రవేశపెట్టారన్నారు.

మహిళలు ప్రశాంత జీవితం, సౌకర్యవంతమైన జీవితం గడపాలని అమ్మవారిని వేడుకుంటున్నామని బండి సంజయ్ అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, ప్రకృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మూగ జయశ్రీ, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, బండ సుమ, సుష్మ, డాక్టర్ నవీన, మనీషదేవి, రంజిత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

గణేశ్‌నగర్, మార్చి 9 : రజకుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి మన ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాలలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనపర్తి శంకర్, పోన్నల తిరుపతి, కోమురయ్య, తిరుపతి, కాల్వ మాల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కరీంనగర్ టౌన్, మార్చి 9: జమ్మికుంటకు చెందిన వాసవీ క్లబ్ బొమ్మిశెట్టి లక్ష్మి గత ఆగస్టులో ఆకస్మిక దుర్మరణం చెందడంతో ఆమె భర్త బొమ్మిశెట్టి శ్రీనివాస్, ఆయన కుటుంబసభ్యులకు వాసవీ ఇంటర్నేషనల్ వారు వాసవీ కుటుంబ సంరక్షణ పథకం కింద రూ.6,22,200 చెక్కును అందజేశారు. శనివారం నగరంలో డిస్ట్రిక్ వి 107 జిల్లా గవర్నర్ వాసవియన్ సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ జంధ్యం మాధవి చేతుల మీదుగా చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవియన్ సిల్వర్‌స్టార్ పవిత్రం శ్రీనివాస్ హాజరుకాగా జిల్లా కార్యదర్శి జంధ్యం మధూకర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తంగళ్ళపల్లి రాజభాస్కర్, రీజియన్ చైర్మన్ రావికంటి నీలకంఠం, యాంసాని రమాదేవి, యాంసాని రమేశ్, క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్‌కుమార్, మురికి పూర్ణిమ, గందె ప్రవీణ్‌కుమార్,ఐత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 9: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా చాలా మంది వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా లక్ష్యాలను ఎంచుకోవాలని తొమ్మిదవ డివిజన్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడుతారో ఆ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లుతారని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌పి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మానకోట సునిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

సుభాష్‌నగర్, మార్చి 9: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కాలేజీలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, సంస్థ అధ్యక్షుడు సాగర్ పాల్గొన్నారు.

నేడు సామూహిక కుంకుమ పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 9: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమపూజలను మఠాధిపతి విష్ణుసేవా నందగిరి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీధర్మశాస్తా సేవాసమితి అధ్యక్షుడు గుండ రాధాకిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 108 మంది ముత్తైదువలచే ఉదయం 10 గంటల నుంచి సామూహిక స్ఫటిక శ్రీచక్ర అభిషేకం, కుంకుమ పూజలు జరుపనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా 'అల్ఫోర్స్ కౌస్తుభం'



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 9: నగరంలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ మైదానంలో కౌస్తుభం పేరుతో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ పమేలా సత్పతి, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డి హాజరుకాగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వారితో కలిసి జ్యోతిప్రజ్వళన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసం కలవడమే కాకుండా విజయాల పట్ల ఆసక్తి పెరుగుతుందని అన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేస్తూ ఉత్తమంగా ఎదగాలని అన్నారు. అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని ఘన విజయాలను నమోదు చేయాలని చెప్పారు. విద్యార్థులు ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న టీఎన్‌జీవో నేత మారం జగదీశ్వర్

సుభాష్‌నగర్, మార్చి 9: మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మూడేళ్లుగా సరైన సమయానికి జీతాలు ఇవ్వలేదన్నారు. ఏరియర్స్‌ను కూడా ఇవ్వలేదని, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న వారికి రావలసిన బెనిఫిట్స్ రాక చాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం తమ ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు అందచేసిందన్నారు. తాము ఎవరికి వ్యతిరేకం కాదన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన డీఏ, పెండింగ్ బిల్లులు పెండింగ్‌లో పెట్టి అనవసరపు ఖర్చులు చేసి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని అన్నారు. 317 జీవోను తీసుకువచ్చి ఉద్యోగులను చాలా ఇబ్బందులకు గురి చేశారన్నారు. సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాగుల నరసింహస్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు గుంటి బిక్షపతి, కొండయ్య, నగేశ్, రాజమనోహర్, సేవ్యానాయక్, విజయ్‌కుమార్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



స్వామివారికి ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట, మార్చి 9: ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలోని శ్రీఅపర్ణ సోమేశ్వరస్వామి శివాలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ కొండ విజయ్ స్వగృహం నుంచి మేళతాలాల మధ్య ముత్యాల తలంబ్రాలు మోసుకెళ్లి శివాలయంలో నిర్వహించే శివపార్వతుల కల్యాణానికి సమర్పించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ మేరకు వేదపండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిగొమ్ముల పావని-వెంకటేష్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కొండ విజయ్, అర్చకులు నరేందర్‌శర్మ, నరేందర్, సారయ్య, దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రజిత-శ్రీనివాస్, చిరంజీవి, కుమార్, మొగిలి, విజయ్, రామకృష్ణ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు వ్యాఖ్యలు సరికాదు

సైదాపూర్, మార్చి 9: రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ రూంలో కూర్చునే ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు చెల్లించిందని మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికాదని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్ని స్కూళ్లలో ఏసీలు పెట్టించాడో హరీష్‌రావు చెప్పాలన్నారు. ఉద్యోగుల పట్ల అలా మాట్లాడడం అవమానించడమేనన్నారు. గత ప్రభుత్వం జీతాలు సరిగా చెల్లించక ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి

జమ్మికుంట, మార్చి 9: వ్యవసాయ రంగంలో నూతన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మధ్యప్రదేశ్ ఎమ్ఎస్ఎమ్ఈ కమిషనర్ పరికిపల్ల నరహరి అన్నారు. శనివారం జమ్మికుంటలో రైతు సేవక్ అగ్రిమాల్ ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రోన్స్ ఆవిష్కరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రోన్‌తో పురుగుల మందు, ఎరువులు సైతం వెదజల్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గాదె గుణసాగర్, జీడి రాజు, కోటేశ్వర్, అంజద్‌పాషా, రైతులు, బిక్కి కంపెని యాజమాన్యం, రైతు సేవక్ అగ్రిమాల్ నిర్వాహకులు, ఆలయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్ షా సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, మార్చి 9: హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు జి రాజు ఆధ్వర్యంలో బీజేపీ బూత్ కమిటీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ నెల 12న హైద్రాబాద్‌లో బీజేపీ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో జరిగే బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరవుతున్నారన్నారు. సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. సమావేశంలో మాడ గౌతమ్‌రెడ్డి, సీహెచ్ నర్సింహరాజు, ముత్యంరావు, వెంకటరెడ్డి, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, వివిధ సంఘాల మోర్చా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

చొప్పదండి, మార్చి 9: గత ఏడాది కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గుమ్లాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలిసి లాభార్థి మిలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగళ్లవానతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం విమర్శించుకోవడం సరికాదన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



గన్నేరువరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గన్నేరువరం, మార్చి 9: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ స్వామి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన ప్రత్యేక పోలీస్ బలగాలతో ఎస్ఐ తాండ్ర నరేష్‌తో కలిసి ప్రధాన వీధులలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలను కోరారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకొని సరైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు.

వీణవంక: పార్లమెంటు ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో కొనసాగాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండల కేంద్రంలో సీఆర్‌పీ ఎఫ్ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత సోషల్‌మీడియాలో కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని అన్నారు.జమ్మికుంట టౌన్ సీఐ రవి,ఎస్సై తోట తిరుపతి ఉన్నారు.

భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

భగత్‌నగర్, మార్చి 9: నగరంలోనిసీతారాంపూర్‌లో జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ సొసైటీ భవన నిర్మాణ పనులకు కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీఅధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య నాగరాజు, సొసైటీ సభ్యులు, కార్పోరేటర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ నార్త్‌జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, మార్చి 9: కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ కాలనీలోని షాలోమ్ చర్చ్‌లో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ కెథడ్రిల్ చర్చ్ చైర్మన్ పాల్ కొమ్మాలు అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉమెన్స్ వింగ్, అన్ని ఇండిపెండెంట్ చర్చ్‌ల పాస్టరమ్మలు పాల్గొన్నారు. అసోసియేషన్ ద్వారా మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు క్రిస్టఫర్, సుధాకర్, డేనియల్, పాల్‌నాయక్, జాన్‌పాల్, ప్రేంకుమార్, బాలరాజు, అభిలాష్, ఉమెన్స్ వింగ్ అధ్యక్ష కార్యదర్శులు సునంద, సుశీలతో పాటు మంజుల, సరిత, సభ్యులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌ను విమర్శిస్తే సహించేది లేదు'

కరీంనగర్ రూరల్, మార్చి 9: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని బీజేపీ కొత్తపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు కెంచ శేఖర్‌అన్నారు. కొత్తపల్లి పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు బండి సంజయ్‌పై మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తున్నారని, కొత్తపల్లి పట్టణంలో ఎంపిగా చేసిన అభివృద్ధి పనుల బుక్‌లెట్‌ను ప్రతి ఇంట్లో ఉందని చదువుకోవాలని హితవు పలికారు. కొత్తపల్లి మున్సిపాలిటీలో ఇంటి పన్నులు తక్కువ చేపిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు అన్న మాటలేమయ్యాయని, వాటిని చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

క్రాస్ కంట్రీ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్: మహారాష్ట్రలోని స్వామి రామానంద్ తీర్థ మరాట్వాడా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు చుక్కల ఐశ్వర్య, సభ మనుష, అకల, కిరణ్, జాన్, శ్యాంకుమార్ ఎంపికయ్యారు. వీరికి కోచ్ మేనేజర్‌గా వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనేయులు వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సంకసాల మల్లేశం, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ మునవర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రావు, రవికుమార్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

హలీం స్టాళ్లకు అనుమతి ఇప్పించింది మంత్రి పొన్నం ప్రభాకరే

కరీంనగర్ అర్బన్: హలీంస్టాళ్ళకు అనుమతి ఇప్పించింది మంత్రి పొన్నం ప్రభాకరేనని, కానీ ఎంఐఎం నాయకులు సిగ్గులేకుండా ఎమ్మెల్యే ఇప్పించినట్లు చెప్పటం హాస్యాస్పదమని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పేర్కొన్నారు. డీసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, మార్చి 9: కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో శరత్ మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు నజీమా నాయకులు సలీం, ఉస్మాన్, గోరిభాయ్, అన్వర్, జబ్బర్, ఇర్ఫాన్, లక్ష్మి పాల్గొన్నారు.

పనులను ప్రారంభించాలి

భగత్‌నగర్, మార్చి 9: నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధంతరంగా నిలిపివేసిన అభివృద్ధి పనులను ప్రారంభించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. పనులు మధ్యలోనే నిలిపి వేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి అర్ధంతరంగా నిలిచి పోయిన రోడ్ల పనులను ప్రారంభించాలన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● వీణవంక: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన అంబరగొండ విజేందర్‌పై అదే గ్రామానికి చెందిన అలుగువెల్లి కవిత కోమల్‌రెడ్డి దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

● మానకొండూర్: మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాలలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరంలో భాగంగా శనివారం వలంటీర్లు ఇంటింటా సర్వే చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

- మానకొండూర్ మండలంలోని రంగపేట గ్రామంలోని యాదవసంఘం ఆధ్వర్యంలో శనివారం మల్లిఖార్జున స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

● ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో నెహ్రూ యువకేంద్రం, శివరుద్రయూత్ వెల్ఫేర్ అసిసోయేషన్ శ్రీరాములపల్లి యువజన సంఘం అధ్యక్షుడు గుత్తికొండ పవన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కారోబార్ తిప్పారపు వీరన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మేకల పులమ్మ, తిప్పారపు విజయ్ ఉన్నారు.

● గన్నేరువరం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో మహిళలకు నారీశక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమంలో పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. యువచైతన్య యూత్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలోని శ్రీ గంగాభవాని శంకర దేవాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి ఉరుముడ్ల కిరణ్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు.

● గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో యువజన సంఘాలు, అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 60మంది యువకులు, అభిమానులు రక్తదానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియామకం అయిన మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శనివారం హన్మకొండలో కలిసి ఘణంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, యండి సలీం, యగ్గని శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: తెలంగాణ రాష్ట్ర హోం శాఖ మంత్రిని వెంటనే నియమించాలని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు అయినప్పటికి హోం శాఖ మంత్రిని నియమించక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా హోం మంత్రిని నియమించాలన్నారు.